క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ఉయ్యాలవాడ : మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ చామల ఉమాదేవి మాయలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 37 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి గురువారం అందజేశారు. అంతకుముందు పాఠశాలలో చదువుల తల్లి సరస్వతీ దేవికి విద్యార్థులు, హెచ్ఎం మహమ్మద్‌షరీఫ్, ఉపాధ్యాయులు పూజలు చేశారు.

నివాళి

చాగలమర్రి: మండల కేంద్రంలో ఇన్‌చార్జ్ మేస్త్రీగా విధులు నిర్వహిస్తున్న మట్టా తిమ్మయ్య (33) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకోలేక బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి తిమ్మయ్య కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు ఉన్నారు.

మద్యం సీసాల ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

ఆళ్లగడ్డ: డివిజన్ సెబ్ కార్యాలయం పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను ఆళ్లగడ్డ సెబ్ సీఐ చంద్రమణి ఆధ్వర్యంలో గురువారం పట్టణ శివారులోని చింతకుంట చెరువు సమీపంలో ధ్వంసం చేశారు.ఆమె మాట్లాడుతూ గత ఏడాదిగా సెబ్ కార్యాలయం పరిధిలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 11 డీపీఎల్, 8 జేడీ కేసులకు సంబంధించిన మద్యం సీసాలను జేసీబీతో ధ్వంసం చేయించామని చెప్పారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

428 మందికి ఈబీసీ నేస్తం

ఉయ్యాలవాడ : వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా మండలంలో 428 మంది లబ్ధిదారులకు రూ.64,20,000 నగదు వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ పథకం కింద రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ సామాజిక వర్గాలకు చెందిన 45 నుంచి 60 సంవత్సరాల్లోపు మహిళలకు ఏడాదికి రూ.15,000 చొప్పున ప్రభుత్వం జమ చేస్తోంది. మూడు విడతలుగా వారి వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ చేసినట్లు ఎంపీడీఓ రఘురాం గురువారం వివరించారు.

హామీలు నెరవేర్చాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పద్మావతి నగర్ ఆర్చ్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు రాజశేఖర్, తోటమద్దులు, గౌస్,చెన్నయ్య మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎరువుల ధరలు తగ్గించాలని కోరారు. విద్యుత్ డిస్కమ్‌ల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు.

గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యత



అహోబిలంలో రోడ్డు పనుల కోసం కొలతలు వేస్తున్న పీఆర్ ఈఈ రామ్మోహన్

ఆళ్లగడ్డ: గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్ పేర్కొన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో నూతనంగా నిర్మించనున్న కాశినాయన ఆశ్రమం రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.2 కోట్లు మంజూరు చేశారన్నారు. త్వరగా సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేస్తామని చెప్పారు. డీఈ లక్ష్మీనరసింహుడు, ఏఈలు కమాల్, నాగరాజు, వైస్ ఎంపీపీ ప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవం



పాండురంగ స్వామి

నంద్యాల(అర్బన్): మండలంలోని పాండురంగాపురం గ్రామంలో వెలసిన శ్రీ రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయ 31వ వార్షికోత్సవాలను శనివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు గురువారం తెలిపారు. ఆలయంలో వెలసిన శ్రీరుక్మిణి సమేత పాండురంగ, వేణుగోపాల, గణపతి కామేశ్వరి నందిసమేత కామేశ్వర, అభయాంజనేయ, సుబ్రహ్మణ్యేశ్వర, వీరభద్ర, నవగ్రహ సమేత స్వాముల వారికి 16వ తేదీ ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య మేళనముతో ప్రారంభమై పుష్పార్చనలు, మంగళ హారతులు తదితర పూజలుంటాయన్నారు. ఈనెల 20వ తేదీ గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

మ్యాపులతో మంచి మార్కులు



పట్టికలు, గ్రాఫ్‌లు, మ్యాప్ పాయింటింగ్, సమాచార విశ్లేషణ వంటి వాటిని బాగా సాధన చేయాలి. భారతదేశ, ప్రపంచ పటాల్లో భౌగోళిక ప్రదేశాలు గుర్తించడంపై సాధన చేస్తే తక్కువ సమయంలో ఎనిమిది మార్కులు సాధించవచ్చు. పాఠ్యాంశం చివర ఉన్న ప్రశ్నలను యథాతథం ఇవ్వకుండా, విద్యా ప్రమాణాలను పరీక్షించే విధంగా ఇస్తారు.

– కేఆర్‌కే శాస్త్రి, స్కూల్ అసిస్టెంట్, సోషల్, జెడ్పీహెచ్ఎస్ గోస్పాడు

ఇంగ్లిష్‌లో రీడింగ్ కాంప్రహెన్షన్‌దే అగ్రస్థానం



ఇంగ్లిష్ ప్రశ్నపత్రంలో మూడు సెక్షన్లలో 1–35 వరకు ప్రశ్నలు ఉంటాయి. పాఠ్య పుస్తకంపై అవగాహన, పాఠ్యాంశం తరువాత ఇచ్చిన గ్రామర్, ఒకాబులరీ, లెటర్ రైటింగ్, కన్వర్జేషన్ తదితర వాటిపై పూర్తి అవగాహన ఉంటే మంచి మార్కులు సాధ్యమే.

–సుధాకర్‌రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, జెడ్పీహెచ్ఎస్, బలపనూరు, పాణ్యం

హిందీపై శ్రద్ధ వహించాలి



హిందీలో సాధన చేయడం పైనే మార్కులు ఆధారపడి ఉంటాయి. పాఠ్యాంశాన్ని పూర్తిగా అర్థం చేసుకుని చదివితే ప్రశ్నలు ఎలా అడిగినా సమాధానాలు రాయవచ్చు. సులభంగా మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం ఉన్న లేఖలు రాయడం, గ్రామర్, పద్య, గద్య భాగాలపై సాధన చేయాలి.

– నాగేంద్రమ్మ, హిందీ స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్ఎస్, దీబగుంట్ల

ఉత్తమ ఫలితాలు విద్యార్థుల చేతుల్లోనే..

- శ్రద్ధ చూపితే 'పది'పై పట్టు
- పరీక్షలపై సబ్జెక్టు నిపుణుల సూచనలు, సలహాలు

గోస్పాడు: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన విద్యార్థుల చేతుల్లోనే ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రణాళిక ప్రకారం సన్నద్ధమైతే కష్టమేమీ కాదంటున్నారు. పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఏడు పేపర్లతో పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక ప్రణాళికతో వారిని మెరుగుపరిచేలా చర్యలు చేపట్టారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో ఉపాధ్యాయుల అభిప్రాయాలు..

లెక్కల్లో..సాధన ముఖ్యం



గణితంలో 1, 2, 4 మార్కుల ప్రశ్నలకు చాయిస్ ఉండదనే విషయాన్ని విద్యార్థులు గమనించాలి. 8 మార్కుల ప్రశ్నలకు మాత్రమే చాయిస్ ఉంటుంది. ప్రస్తుత విధానంలో ఏ, బీ గ్రేడ్ విద్యార్థులు అధికంగా మార్కులు పొందేందుకు, సీ, డీ గ్రేడ్ విద్యార్థులు ఉత్తీర్ణులు కావడానికి అనువుగా ఉంది. గణిత భావనలు,సూత్రాలపై పట్టు సాధించాలి.

– మధుసూదన్‌రాజు, స్కూల్‌అసిస్టెంట్, మ్యాథ్స్, జెడ్పీహెచ్ఎస్, పోలూరు

విశ్లేషణాత్మకంగా రాయాలి



తెలుగులో ఈ ఏడాది పద్య పూరణ, ప్రతి పదార్థం తొలగించారు. దాని స్థానంలో అవగాహన–ప్రతిస్పందనలో భాగంగా 8 మార్కులకు పాఠ్యాంశంలో ఉన్న పద్యం ఇచ్చి ప్రశ్నలు ఇస్తారు. అలాగే పరిచిత గద్యం చదివి సమాధానాలు రాయాలి. ప్రతి స్పందన విభాగంలో సులభంగా 32 మార్కులు పొందవచ్చు అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా జవాబులు రాయాలి.

– దోనెపూడి నరేష్‌బాబు, పాఠశాల సహాయకులు, తెలుగు, సంగపట్నం జెడ్పీహెచ్ఎస్

జీవశాస్త్రాన్ని ఇష్టంగా చదవాలి



'ఈ ఏడాది పేపరు–1, పేపరు–2గా వేర్వేరు రోజుల్లో నిర్వహిస్తున్నారు. 1వ ప్రశ్న నుంచి 17వ ప్రశ్న వరకు బయాలజీ ప్రశ్నలుంటాయి. విద్యార్థులు ప్రయోగాలు, బేధాలు, చిత్రపటాలు, టేబుల్స్‌పై శ్రద్ధ చూపాలి, చిత్రపటాలు, ప్రయోగశాల కృత్యాలకు ప్రాధాన్యం ఉంటుంది. శాస్త్రవేత్తల పరిశోధనలపై అభ్యసనం చేయాలి.

– శారద, స్కూల్ అసిస్టెంట్, బయాలజికల్ సైన్స్, జెడ్పీహెచ్ఎస్, యాళ్లూరు

ప్రయోగాలు, డయాగ్రమ్స్ ముఖ్యం



'భౌతికశాస్త్రంలో కాంతి, విద్యుత్ యూనిట్లు, సూత్రాల ఉత్పాదన, గణన, నిత్య జీవిత వినియోగం, భేదాలు, ఉష్ణం, సమతులాల వద్ద క్రాంతి పరివర్తనను, వక్రతలాల వద్ద, విద్యుత్ పాఠాల నుంచి వ్యాసరూప ప్రశ్నలు వస్తాయి. రసాయన శాస్త్రంలో కర్బన సమ్మేళనాలు, సమీకరణాలు, పరమాణు నిర్మాణం, లోహ సంగ్రహణ శాస్త్రం. మూలకాల వర్గీకరణ, రసాయన బంధాలు, ఆమ్లాలు, డయాగ్రమ్స్ చాట్స్. ఎస్, పీ, డీ ఆర్బిటల్‌స, రివర్సరేటరి, ఫర్నెస్ మొదలనవి, క్షారాలు యూనిట్లపై పూర్తి పట్టు సాధించాలి. శాస్త్రవేత్తల విశేషాలను బాగా గుర్తుంచుకోవాలి. ప్రయోగాలు, డయాగ్రమ్స్‌పై దృష్టి సారిస్తే ఎనిమిది మార్కులు సాధించొచ్చు.

– మస్తానయ్య, పీజీటీ ఫిజిక్స్, మోడల్ స్కూల్, గోస్పాడు



వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం మూడో విడత నిధుల విడుదలలో భాగంగా బనగానపల్లె పర్యటకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మజీద్‌యే ఆసద్బన్ అభివఖాస్, ఫాతిమా మసీదుల్లో గురువారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు, సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లా దయవల్ల నంద్యాల నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ప్రజలకు అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలు అందడంతో ఆనందంగా ఉన్నారన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.



చాగలమర్రిలో సరస్వతీ పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

చాగలమర్రి: ప్రతి విద్యార్థి లక్ష్యంతో విద్యనభ్యసించాలని హెచ్ఎం కోటయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సరస్వతీ పూజలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉపవాస మాసం

- మొదలైన రంజాన్ దీక్షలు
- 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్ష చేయనున్న ముస్లింలు
- జిల్లాలో 350కు పైగా మసీదులు



దీక్ష అనంతరం ఇఫ్తార్ స్వీకరిస్తున్న ముస్లింలు

నంద్యాల(వ్యవసాయం): ముప్పై రోజులు.. రోజుకు ఐదు సార్లు నమాజ్ పఠనం .. 13 గంటల పాటు కఠిన ఉపవాస దీక్ష.. వీటితో పాటు తరావిహ్ నమాజ్‌తో దివ్య ఖురాన్ ప్రవచనాలను వినే అవకాశం.. దాతృత్వంతో నిరుపేదలను ఆదుకునే తత్వం.. ఇవన్నీ మేళవించిన పవిత్ర రంజాన్ మాసం ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం తొమ్మిదో నెల అయిన రంజాన్ 11వ తేదీ సాయంత్రం నెలవంక దర్శనంతో ఆరంభం కాగా మంగళవారం నుంచి ఉపవాస దీక్షలు పాటిస్తున్నారు. నంద్యాల జిల్లా పరిధిలోని 350 కు పైగా మసీదుల్లో సోమవారం రాత్రి నుంచే రంజాన్ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. దివ్య ఖురాన్‌లోని 30 భాగాల్లో రోజూ ఒక్కో భాగాన్ని పఠిస్తారు. దివ్య ఖురాన్ రంజాన్ మాసంలోనే అవతరించినట్లు ముస్లింల విశ్వాసం.

నమాజ్ కోసం ఏర్పాట్లు...

మసీదు కమిటీలు ప్రార్థనాలయాలను అలంకరించడంతో పాటు నమాజ్ కోసం ఏర్పాట్లు, సాయంత్రం ఇఫ్తార్ కోసం తాగునీటి సౌకర్యం కల్పించాయి. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందే నిర్దేశించిన సమయానికి ఉపవాసాన్ని (సహేరి) ప్రారంభించి సూర్యాస్తమయం (ఇఫ్తార్) వరకు కొనసాగిస్తారు. ఓపిక, సహనం, పేదల ఆకలి బాధ తెలియడమే లక్ష్యంగా ఉపవాసాన్ని పాటించాలంటూ ఇస్లాం నిర్దేశించింది. నిర్ణయించిన మేరకు దాన, ధర్మాలు పాటించాలని చెప్పడంతో రంజాన్ మాసంలో ముస్లింలు దానధర్మాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. రంజాన్ మాసంలోని మొదటి ఉపవాస దీక్షలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పాతపట్టణం రద్దీగా కనిపిస్తోంది. మార్కెట్లన్నీ కళకళలాడుతున్నాయి. జిల్లాలోని నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు తదితర ప్రాంతాల్లో విక్రయాలు రోడ్డుపైకొచ్చాయి. అంతటా రంజాన్ మార్కెట్ కొనసాగుతుంది. వినియోగదారులతో దుకాణాలన్నీ బిజీగా మారాయి. రోజూ నిర్వహించే ఉపవాస దీక్షలను పురస్కరించుకొని ముస్లింలు షాపింగ్ చేస్తుండడంతో వ్యాపార కేంద్రాలన్నీ కిక్కిరిసి పోతున్నాయి.

రంజాన్ ప్రత్యేకతలకు నిలయం



రంజాన్ మాసంలో కఠోర నియమాలు, ఉపవాస దీక్షలకు నిలయం. నెల రోజుల పాటు పగలు నిష్టగా ఉపవాసం పాటిస్తూ ఆహార, పానీయాలు మానేయడం మాత్రమే రోజా కాదు.. నియమాలతో కూడుకున్న జీవన విధానాన్ని ఆచరిస్తారు. నిత్యం సుమారు 13గంటల పాటు కఠిన ఉపవాస దీక్షను అవలంబిస్తూ ఖురాన్ పఠిస్తారు.

–అంజాద్‌బాషా, ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు, నంద్యాల

ఆర్యవైశ్యులకు ప్రాధాన్యతనివ్వాలి

నంద్యాల(వ్యవసాయం): అన్ని రాజకీయ పార్టీలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆర్యవైశ్యులకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి విజయశేఖర్, ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి బింగుమళ్ల శ్యాం, గౌరవాధ్యక్షుడు కందేశ్యాంసుందర్‌లాల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదోనిలో విట్టా రమేష్‌కు బీజేపీ టికెట్ కేటాయించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో రాజకీయ అర్హత కలిగిన వారికి టికెట్ ఇవ్వాలనికోరారు. కార్యక్రమంలో నాగరాజు, చంద్రశేఖర్, శ్రీనివాస్, దత్తాత్రేయ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్తగా ఉండాలి

దొర్నిపాడు: రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారి నాగేంద్ర సూచించారు. గురువారం ఆయన స్థానిక వైద్యశాలలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటలు దాటిన తరువాత అత్యవసరమైతే బయటకు రావద్దని చెప్పారు. తరచూ మంచినీరు తాగుతుండాలని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తలపై టోపీ, గొడుగు, తువాళు రక్షణగా కప్పుకోవాలన్నారు. సాధ్యమైనంత త్వరగా ఇంటికొచ్చేలా చూడాలన్నారు. ప్రస్తుతం 38–40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, మరింత పెరిగే అవకాశముందని, అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పనులకు వెళ్లేవారు.. ఎండ ముదిరేలోపు ఇంటికి చేరుకోవాలని తెలిపారు.

జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): స్థానిక శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 16 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు.జాబ్ మేళాలో 150 మంది డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. బెంగళూరుకు చెందిన ఆల్‌సెక్ టెక్నాలజీ, మన్సోస్ టెక్నాలజీ హెచ్ఆర్ మేనేజర్ బాబాఫక్రుద్దీన్ కంపెనీ గురించి, జాబ్‌రోల్ వివరించారు. ఎంపికైన వారికి బెంగళూరు, చెన్నైలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఏడాదికి రూ.2.2 లక్షల నుంచి రూ.2.40 లక్షల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. డాక్టర్ యువీఎస్ కుమార్, కేఎస్‌కుమార్, లీలామాధవ్ పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల మంజూరు

శిరివెళ్ల: మండలంలోని గ్రామ పంచాయతీలకు 2023–24 ఆర్థిక సంవత్సరం మొదటి విడత టైడ్, బేసిక్ గ్రాంట్ మంజూరైందని ఎంపీడీఓ ఫణి రాజకుమారి గురువారం తెలిపారు. శిరివెళ్ల మేజర్ గ్రామ పంచాయతీకి రూ.36.30 లక్షలు, యర్రగుంట్లకు రూ.13.90 లక్షలు, గోవిందపల్లెకు రూ.13.92 లక్షలు మంజూరయ్యాయి. బోయలకుంట్ల రూ.6.33 లక్షలు, చెన్నూరు రూ.5.88 లక్షలు, గుంప్రమాన్‌దిన్నె రూ.6.49 లక్షలు, గంగవరం రూ.3.81 లక్షలు, గుండంపాడుకు రూ.6.49 లక్షలు, జీనేపల్లెకు రూ.2.71 లక్షలు, కోటపాడు రూ.4.75 లక్షలు, కామినేనిపల్లెకు రూ.3.05 లక్షలు విడుదలయ్యాయి. మోత్కలపల్లెకు రూ.2.31 లక్షలు, వనికినిదిన్నె రూ.2.18 లక్షలు, వీరారెడ్డిపల్లెకు రూ.2.29 లక్షలు, వెంకటాపురం రూ.2.75 లక్షలు వచ్చాయని చెప్పారు. వీటితో తాగునీరు, విద్యుత్ బకాయిలు చెల్లింపులు, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

గోస్పాడు: వేసవి కాలంలో దాహార్తితో ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు బెక్కెం శకుంతలమ్మ తెలిపారు. గురువారం మండలంలోని యాళ్లూరు గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రంలో కూలింగ్ వాటర్, మజ్జిగ అందజేస్తారని చెప్పారు. సర్పంచ్ రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలపై అవగాహన

నంద్యాల టౌన్: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో గురువారం కిడ్నీల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం, కిడ్నీ సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నెఫ్రాలజీ డాక్టర్ సాయి శ్రీవాణి మాట్లాడుతూ కిడ్నీ సమస్యలను తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ఆచరించాలన్నారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రమేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్‌జీఓస్ కాలనీలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

మరోసారి ఆశీర్వదించండి

నంద్యాల(సిటీ): అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేసి ప్రజాసమస్యలను పరిష్కరించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఎన్‌జీఓ, ఎస్‌బీఐ కాలనీలు, వైఎస్సార్ నగర్‌లో గురువారం రూ.1.48 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమాన్ని ప్రజలు గమనించాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అభివృద్ధి సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంషావలి, వార్డు కౌన్సిలర్లు దేశం సులోచన, విజయభాస్కర్, సావిత్రమ్మ, వార్డు ఇన్‌చార్జ్‌లు దేశం సుధాకర్‌రెడ్డి, రమణ ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



రెడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో భూమా, గంధం

రుద్రవరం: మండల కేంద్రం మజరా అయిన రెడ్డిపల్లె గ్రామంలో టీడీపీ వర్గీయులు గురువారం భూమా కిశోర్‌రెడ్డి, గంధం భాస్కర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన పుట్టా సన్న, ఎద్దుల బాబు, శ్రీనివాసులు,ఓబులేసు,ముద్దాసు ప్రసాదు,అన్నవరం ప్రసాదు,మనోహర్,ఆదినారాయణ, చిన్నరాముడు, చిన్న కిట్టు, ఎర్రన్నలతో పాటు మరో 20 కుటుంబాలు పార్టీలో చేరగా వారికి భూమా కిశోర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న పాలన నచ్చి ఇతర పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. టీడీపీ అభ్యర్థి అఖిలప్రియ అరాచకాలు అధికమయ్యాయని, దౌర్జన్యాలు చూడలేకనే పార్టీ మారుతున్నారన్నారు. ఇందుకు నిదర్శనం రుద్రవరంలోని రహిమాన్ నుంచి డబ్బులు లాక్కున విషయం ప్రజలందరికీ తెలిసిందేనని, ఇటీవల ప్రచారానికి వచ్చిన ఆమెను రహిమాన్ కుటుంబ సభ్యులు నిలదీస్తే పోలీసుల రక్షణతో బయట పడ్డారని ధ్వజమెత్తారు. అంబటి మహేశ్వర్‌రెడ్డి, ఆర్.నాగులవరం నరసింహ, మోహన్, గౌసపీర్ ఉన్నారు.

మంచి నీటి సరఫరాకు చర్యలు

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగలవరంలో మంచినీటి సరఫరాకు గ్రామ సర్పంచు గంధం సావిత్రమ్మ ముందస్తు చర్యలు చేపట్టారు. ఇప్పటికే బోరు మోటర్ నుంచి ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు సరఫరా చేస్తున్నామని, అయితే భూగర్భ జలాలు అడుగంటడంతో చేతి పంపులో సింగిల్ ఫేస్ మోటార్లు అమర్చి నీటిని ఓవర్ హెడ్ ట్యాంకుకు సరఫరా చేయిస్తున్నామని చెప్పారు. ట్యాంకు ద్వారా గ్రామంలోని అన్ని కాలనీలకు నీరు సవ్యంగా సరఫరా సాగుతోందన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

శిరివెళ్ల: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఈఓ శంకర ప్రసాదు గురువారం తెలిపారు. పరీక్షల నిర్వహణకుగాను మండలంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని, శిరివెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 140 మంది, మోడల్ స్కూల్ కేంద్రంలో 150 మంది, యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఏ సెంటర్‌లో 170, బీ సెంటర్‌లో 170 మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. చీఫ్ సూపరిండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను ఇప్పటికే నియమించారని, పరీక్షల ప్రశ్నాపత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచామని వివరించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



రుద్రవరంలో భూమి పూజ చేసిన దృశ్యం

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు ముత్తలూరులో సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. రుద్రవరంలోని దాసరిపల్లె, బెస్త కాలనీలో దాదాపు రూ.15 లక్షలతో, ముత్తలూరులో కొత్త బీసీ కాలనీలో రూ.5లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలను ఎంపీపీ బాలస్వామి, కార్యదర్శులు అరవింద నాయక్, మౌనిక, శ్రీహరి, పాలరామకృష్ణారెడ్డి, బాల చెన్నయ్య,నంద్యాల నారాయణ రెడ్డి, బండల మాబు, మేస్త్రీ హుసేన్, లింగమయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.